ఆశీర్వదించండి.. సేవకుడిగా పనిచేస్తా

బీఎస్పీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్


జిన్నారంలో రోడ్‌షో నిర్వహిస్తున్న బీఎస్పీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్

జిన్నారం(పటాన్‌చెరు): ఒక్క అవకాశమిచ్చి ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజకవర్గాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి చేస్తానని బీఎస్పీ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ ఓటర్లను కోరారు. గుమ్మడిదల, జిన్నారం మండలాల్లో ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను చేపడుతున్న ప్రచారానికి అన్నివర్గాల ప్రజల నుంచి మంచి స్పందన వచ్చిందన్నారు. ఆదరించి అవకాశం కల్పిస్తే అన్నివర్గాల ప్రజలకు సేవకుడిగా పనిచేస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

జ్యోతిబాపూలేకు నివాళి



నారాయణఖేడ్: ఖేడ్ మండల పరిధిలోని జూకల్ శివారులోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల, కళాశాలలో మంగళవారం జ్యోతిబాపూలే వర్ధంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌గౌడ్ మాట్లాడుతూ సమాజ శ్రేయస్సు కోసం ప్రతిఒక్కరూ జ్యోతిబాపూలేను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏటీపీ శివశంకర్, లైబ్రేరియన్ గోవింద్‌రావు, డిప్యూటీవార్డెన్ బాలమణి, ఉపాధ్యాయులు, అధ్యాపకులు శ్రీలక్ష్మి, హరీశ్, వెంకటేశం, విజయ్‌కుమార్, మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను నమ్మితే కష్టాలు తప్పవు

- రాష్ట్రం నుంచి బీజేపీని తరిమికొట్టండి
- రాయి ఏదో రత్నమేదో గమనించండి
- సీఎం కేసీఆర్‌తోనే సమర్థవంత పాలన
- బీఆర్‌ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి


పటాన్‌చెరు డివిజన్‌లో రోడ్‌షో నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: కాంగ్రెస్ పార్టీని నమ్మితే కష్టాలు తప్పవని బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. ప్రచారంలో భాగంగా చివరి రోజైన మంగళవారం బీఆర్‌ఎస్ పట్టణ కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి జీఎంఆర్ ఫంక్షన్‌హాల్ వరకు వేలాదిమందితో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 60ఏళ్ల పాటు రాష్ట్రాన్ని పరిపాలించిన కాంగ్రెస్, మతతత్వ నినాదంతో గద్దెనెక్కిన బీజేపీలను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, కార్పొరేటర్ కుమార్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయకుమార్, సీనియర్ నాయకులు శంకర్‌యాదవ్, సపానదేవ్, పార్టీ పట్టణ అధ్యక్షుడు అఫ్జల్, సీనియర్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమం

బీఆర్‌ఎస్‌తోనే సంక్షేమ పాలన సాధ్యమవుతుందని అమీన్‌పూర్ మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్‌చైర్మన్ నందారం నరసింహగౌడ్ అన్నారు. మహిపాల్‌రెడ్డికి మద్దతుగా మున్సిపల్ పరిధిలో పలు కాలనీలో ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నందారం రమేష్‌గౌడ్, జ్ఞానేశ్వర్, ఓం ప్రకాష్, కౌన్సిలర్ కృష్ణ, యువ నాయకుడు తుమ్మల యశ్వంత్‌రెడ్డి, కోఆప్షన్ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే గెలిపిస్తాయి

సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే మరోసారి బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తాయని ఆ పార్టీ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలంలోని లక్డారం, చిట్కుల్, పోచారం, బచ్చుగూడెం గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. పటాన్‌చెరు మాజీ జెడ్పీటీసీ శ్రీకాంత్‌గౌడ్, మాజీ ఎంపీపీ శ్రీశైలంయాదవ్, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీకి బిగ్ షాక్

పటాన్‌చెరు టౌన్: అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ముగుస్తున్న వేళ బీజేపీ అభ్యర్థి నందీశ్వర్‌గౌడ్ ముఖ్య అనుచరుడు పటాన్‌చెరు పట్టణానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు కిరణ్‌గౌడ్ తన తండ్రి లక్ష్మణ్‌గౌడ్‌తో కలిసి మహిపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, మధుసూదన్‌రెడ్డి, శ్రీధర్‌చారి, ఈర్ల రాజు, వంగరి అశోక్, పృథ్వీరాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరికలు

బీజేపీ అనుబంధ సంస్థ బీఎంఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు విజయ్‌కుమార్ తన అనుచరులు సాయికుమార్, మనికుమార్, సాయికుమార్, ప్రణీత్, సుధాకర్, సత్యనారాయణ తదితరులు మహిపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ శంకర్‌యాదవ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అశోక్, ఈర్ల రాజు పాల్గొన్నారు. అదేవిధంగా మండల పరిధిలోని భానూరు గ్రామానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకులు పుప్పాలగూడెం నగేష్‌యాదవ్ తన అనుచరులతో కలిసి బీఆర్‌ఎస్‌లో చేరారు.


పటాన్‌చెరు టౌన్: మహిపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన బీఎంఎస్ నాయకులు

ముమ్మరంగా ఎన్నికల ప్రచారం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఎన్నికల ప్రచారం చివరి రోజు కావడంతో ఆయా ప్రాంతాల్లో బీఆర్‌ఎస్ నేతలు జోరుగా ప్రచారం నిర్వహించారు. రామచంద్రాపురం పట్టణంలో కార్పొరేటర్ పుష్పనగేష్, మాజీ కార్పొరేటర్ అంజయ్య, భారతీనగర్ డివిజన్‌లో కార్పొరేటర్ సింధుఆదర్శ్‌రెడ్డి, తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో మున్సిపల్ చైర్‌పర్సన్ లలితాసోమిరెడ్డి ఆధ్వర్యంలో వేర్వేరుగా ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారం నిర్వహించారు.


రామచంద్రాపురం: భారతినగర్ డివిజన్‌లో ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ సింధుఆదర్శ్‌రెడ్డి

మరో 52 గంటలు కష్టపడి పనిచేయండి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): బీఆర్‌ఎస్ గెలుపునకు నాయకులు, కార్యకర్తలు 52 రోజులు చేసిన కష్టం కంటే అధికంగా మరో 50 గంటలు కష్టపడి పని చేయాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి మహిపాల్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని లక్ష్మిగార్డెన్‌లో మాజీ రాష్ట్ర శాసనమండలి చైర్మన్ భూపాల్‌రెడ్డితో కలిసి మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.9వేల కోట్లతో అభివృద్ధి పనులు చేసినట్లు తెలిపారు. కాంగ్రెస్, బీజేపీలకు దిమ్మదిరిగే విధంగా ప్రజలు తీర్పు ఇవ్వాలన్నారు. మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, కార్పొరేటర్లు పుష్పనగేష్, సింధుఆదర్శ్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు శంకర్‌యాదవ్, సపానదేవ్, మాజీ ఎంపీపీ యాదగిరియాదవ్, నాయకులు ఆదర్శ్‌రెడ్డి, గోవింద్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటు వేయండి

జిన్నారం(పటాన్‌చెరు): అభివృద్ధిని చూసి ఓటు వేయాలని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు చంద్రారెడ్డి అన్నారు. బొల్లారం మున్సిపల్ పరిధిలోని వెంకట్‌రెడ్డినగర్, బీసీ కాలనీ, గాంధీనగర్, లక్ష్మినగర్, బీరప్పబస్తీ, వినాయకనగర్, జ్యోతినగర్‌లో మహిపాల్‌రెడ్డికి మద్దతుగా బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు చంద్రారెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, నాయకులు, కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు.


జిన్నారం: బొల్లారం మున్సిపాలిటీలో ప్రచారం నిర్వహిస్తున్న సీనియర్ నాయకులు చంద్రారెడ్డి, నాయకులు

క్లుప్తంగా

తాళం వేసిన ఇంట్లో చోరీ

హత్నూర(సంగారెడ్డి): తాళం వేసి ఉన్న ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ సంఘటన హత్నూర మండలంలోని మంగాపూర్ గ్రామంలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నీరుడి ఆంజనేయులు సోమవారం రాత్రి నర్సాపూర్ మండలం రుస్తుంపేట గ్రామంలో జరిగిన లక్షదీపార్చన కార్యక్రమంలో పాల్గొనేందుకు కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి వెళ్లారు. గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు తాళం పగలగొట్టి పెట్టెలో ఉన్న రూ.2లక్షలను ఎత్తుకెళ్లారు. దీంతో బాధితుడు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

రామచంద్రాపురం(పటాన్‌చెరు): నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న మద్యం బాటిళ్లను మంగళవారం రామచంద్రాపురం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో ఇద్దరు వ్యక్తులు వాహనాల్లో 393 లీటర్ల మద్యాన్ని తరలిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అమీన్‌పూర్ పరిధిలో..

పటాన్‌చెరు టౌన్: కారులో మద్యాన్ని తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం మేరకు అమీన్‌పూర్ పోలీసులు వాహన తనిఖీ నిర్వహించి 720 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. మద్యం విలువ రూ.లక్షా 42 వేలు ఉంటుందని పోలీసులు తెలిపారు. మద్యంను తరలిస్తున్న వ్యక్తులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

31 లీటర్ల మద్యం స్వాధీనం

పటాన్‌చెరు టౌన్: 31 లీటర్ల మద్యం బాటిళ్లను పట్టుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ మండల పరిధిలోని పటేల్‌గూకు చెందిన సంతోష్‌కుమార్ ఇంట్లో ఫంక్షన్ ఉందని 31లీటర్ల మద్యంను తీసుకెళ్తుండగా నవ్య చౌరస్తాలో పోలీసులు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రెండు బీర్ కాటన్‌లు పట్టివేత

పటాన్‌చెరు టౌన్: రెండు బీర్ కాటన్లను స్వాధీనం చేసుకున్న సంఘటన అమీన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అమీన్‌పూర్ పరిధిలోని బంధం కొమ్ముకు చెందిన సాయికృష్ణారెడ్డి రెండు రోజులు ఎన్నికల నేపథ్యంలో వైన్స్‌లు బంద్ ఉంటాయని, రెండు బీర్ కాటన్‌లు బీరంగూడ నుంచి ఆటోలో తీసుకెళ్లి లింగం చౌరస్తా వద్ద దిగాడు. దీంతో గమనించిన పోలీసులు ఎన్నికల నియమాలని ఉల్లంఘించిన నేపథ్యంలో బీర్ కాటన్‌లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సిబ్బంది అనంతరాజశర్మ, సునీతారెడ్డి తదితరులు పరిశీలించారు. మంగళవారం పెద్దశంకరంపేటతో పాటు కోళాపల్లి, బూర్గుపల్లి, మక్తలక్ష్మాపూర్, మాడ్చెట్‌పల్లి తదితర గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల వసతులను వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల నిర్వహణకు సహకరించాలని కోరారు. ఓటర్లు తప్పకుండా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని వారు సూచించారు.

బీఆర్‌ఎస్‌కు చరమగీతం పాడుదాం

- కాంగ్రెస్ పార్టీని గెలిపించండి
- 'గ్యారంటీ'ల అమలుకు బాధ్యత నాదే
- కోల్డ్‌స్టోరేజీ, జిన్నింగ్ మిల్లులు ఏర్పాటు
- జహీరాబాద్ నియోజకవర్గం అభివృద్ధి కృషి
- కాంగ్రెస్ అభ్యర్థి ఎ.చంద్రశేఖర్


రోడ్‌షోలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్, పక్కన ప్రియాంకగాంధీ

జహీరాబాద్: ఆచరణకు సాధ్యంకాని హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేసిన బీఆర్‌ఎస్ పాలనకు రాబోయే ఎన్నికల్లో చరమగీతం పాడుదామని కాంగ్రెస్ అభ్యర్థి ఎ.చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మంగళవారం జహీరాబాద్ పట్టణంలో ప్రియాంకగాంధీ ఎన్నికల ప్రచార సభలో పాల్గొన్న సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడారు. కోహీర్ ప్రాంతంలో అలుగడ్డ, పత్తి పంటలు అధికంగా పండిస్తున్నారని, రైతులకు సరైన ధర రాక పోవడంతో తీవ్ర నష్టాల పాలవుతున్నారన్నారు. దీంతో నష్టాల నుంచి గట్టెక్కించేందుకు వీలుగా కోల్డ్‌స్టోరేజీ నిర్మించేందుకు కృషి చేస్తానని తెలిపారు. న్యాల్‌కల్, ఝరాసంగం మండలాల్లో పత్తిపంట అధికంగా పండిస్తున్నారన్నారు. అదేవిధంగా ఆయా ప్రాంతాల్లోని రైతులకు గిట్టుబాటు ధర అందించేందుకు వీలుగా జిన్నింగ్ మిల్లులను ఏర్పాటు చేయిస్తానని హామీనిచ్చారు. కోహీర్ మండల కేంద్రంలో డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేస్తామన్నారు. జహీరాబాద్ మున్సిపల్ పరిధిలో రోడ్లు, డ్రైనేజీలను నిర్మిస్తామని తెలిపారు. అన్నివర్గాల ప్రజల సంక్షేమం కోసం పాటుపడుతూ అందుబాటులో ఉంటానని చెప్పారు. మాజీ ప్రధాని దివంగత ఇందిరాగాంధీకి ప్రతిరూపమైన ప్రియాంకగాంధీ మన దగ్గరకు రావడం సంతోషకరమైన విషయమన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారంటీ పథకాలను అందిస్తామని భరోసా కల్పించేందుకు ఆమె జహీరాబాద్ వచ్చారని వివరించారు.

రోడ్‌షోకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

ఝరాసంగం(జహీరాబాద్): జహీరాబాద్ పట్టణంలో నిర్వహించిన కాంగ్రెస్ నేత ప్రియాంకగాంధీ రోడ్ షోకు మండలం నుంచి కాంగ్రెస్ శ్రేణులు అధికసంఖ్యలో తరలివెళ్లారు. ఝరాసంగం నుంచి ఆ పార్టీ మండల అధ్యక్షుడు హన్మంత్‌రావు పాటిల్ ఆధ్వర్యంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో తరలివెళ్లారు. అదేవిధంగా యువజన కాంగ్రెస్ విభాగం ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం హన్మంత్‌రావు పాటిల్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఎంపీపీ దేవదాసు, వైస్‌ఎంపీపీ మల్లన్నపటేల్, ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు శంకర్పాటిల్, యువజన కాంగ్రెస్ విభాగం జిల్లా అధ్యక్షుడు ఉదయ్‌శంకర్ పాటిల్, ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు సంగన్న ముదిరాజ్, ఎస్సీ సెల్ విభాగం మండల అధ్యక్షుడు పెంటయ్య, ప్రజాప్రతినిధులు, నాయకులు ముల్తాని, నవాజ్‌రెడ్డి, రాజ్‌కుమార్, నందప్ప, మోహన్‌రెడ్డి, హనుమంత్‌రెడ్డి, రాజ్‌కుమార్ స్వామి, శ్రీకాంత్‌రెడ్డి, మహేందర్ పాల్గొన్నారు.


ప్రియాంకగాంధీకి స్వాగతం పలికేందుకు వేచి చూస్తున్న కర్ణాటక మంత్రి ఈశ్వర్‌ఖండ్రే, కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్


జహీరాబాద్ పట్టణానికి బైక్‌ర్యాలీతో తరలివెళ్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

ఆరు గ్యారంటీలతో అన్నివర్గాలకు ప్రయోజనం

నారాయణఖేడ్: కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన ఆరు గ్యారంటీలతో ప్రతీ కుటుంబానికి ఏడాదికి రూ.2.50 లక్షల లబ్ధి చేకూరుతుందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు, జహీరాబాద్ మాజీ ఎంపీ సురేష్‌షెట్కార్, ఖేడ్ కాంగ్రెస్ అభ్యర్థి సంజీవరెడ్డి అన్నారు. నారాయణఖేడ్‌లో శ్రీరామ్ మందిర్ నుంచి శివాజీ, బసవేశ్వర చౌక్‌ల మీదుగా రాజీవ్ కూడలి వరకు రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరు గ్యారంటీలతో పాటు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ, రైతుభరోసా కింద ఎకరాకు ఏటా రూ.15 వేలు, వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12వేలతో పాటు అనేక సంక్షేమ కార్యక్రమాలను మెనిఫెస్టోలో చేర్చడం జరిగిందన్నారు. నారాయణఖేడ్‌లో ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సంతను అనువుగాని చోటకు తరలించి ఆరునెలల పాటు చిరువ్యాపారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేయగా కేసులు నమోదైనా భయపడకుండా పోరాడి పాతస్థలానికి మార్పించుకున్నామని తెలిపారు. హస్తం గుర్తుకు ఓటు వేసి కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యులు కర్నె శ్రీనివాస్, నాయకులు నగేష్‌షెట్కార్, తాహెర్ అలీ, వివేకానంద్ పాల్గొన్నారు.


రోడ్‌షోలో మాట్లాడుతున్న కాంగ్రెస్ అభ్యర్థి సంజీవరెడ్డి, నాయకులు

భార్య ఫోన్‌లో మాట్లాడుతుందని..

అనుమానంతో భర్త ఆత్మహత్య

పటాన్‌చెరు టౌన్: భార్య ఫోన్‌లో మాట్లాడుతుందని అనుమానం పెంచుకున్న భర్త యాసిడ్ తాగి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ సురేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నెల్లూరుకు చెందిన హరికృష్ణ(26) బతుకుదెరువు కోసం వచ్చి రుద్రారంలో ఉంటూ సంగారెడ్డి పరిధిలోని పుల్కల్‌లో ప్రవేట్ స్కూల్లో టీచర్‌గా పని చేస్తున్నాడు. హరికృష్ణకు మూడు నెలల క్రితం ప్రకాశం జిల్లాకు చెందిన మానసతో వివాహం జరిగింది. హరికృష్ణకు గత నెల 17న ఆపరేషన్ జరిగింది. అప్పటి నుంచి ఇంటి వద్ద ఉంటున్నాడు. కాగా అతని భార్య మానస ఫోన్‌లో తరచూ మాట్లాడుతుందని అనుమానం పెంచుకున్న హరికృష్ణ సోమవారం ఉదయ్యం ఇంట్లో యాసిడ్ తాగాడు. గమనించిన భార్య స్థానికుల సహకారంతో ఇస్నాపూర్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. స్థానికులు ఇచ్చిన సమాచారంతో వెంటనే ఘటనాస్థలానికి చేరుకొని పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి


ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటేశ్

నారాయణఖేడ్: నియోజకవర్గంలో పోలింగ్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి వెంకటేశ్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం పలు వివరాలను వెల్లడించారు. 8 మండలాలకు సంబంధించి 2,31,188మంది ఓటర్లు ఉన్నారని, ఇందులో పురుషులు 1,16,581, స్త్రీలు 1,14,599మంది, ఇతరులు 8మంది ఉన్నట్లు తెలిపారు. మొత్తం 296 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయగా ఇందులో 66 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించామని, 35రూట్లుగా విభజించినట్లు చెప్పారు. ఎన్నికల నిర్వహణకు గాను 338మంది పీవోలు, 338మంది ఏపీవోలు, 676ఓపీవోలు, మొత్తం 1,352మంది సిబ్బందిని వినియోగిస్తున్నారు. ఎన్నికల సిబ్బందిని తరలించేందుకు 35 ఆర్టీసీ బస్సులు, 50 క్రూజర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది బుధవారం ఉదయం రిసెప్షన్ సెంటర్‌కు చేరుకోవాలని, సామగ్రి తీసుకున్న అనంతరం సాయంత్రం 5గంటలలోపు కేటాయించిన పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. 30న ఉదయం పోలింగ్‌కు ముందు మాక్‌పోలింగ్ నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఖేడ్ పట్టణంలో 20 పోలింగ్ కేంద్రాలు ఉండగా 17,213మంది ఓటర్లు ఉన్నారని తెలిపారు. నియోజకవర్గంలో మొదటి పోలింగ్ కేంద్రం కంగ్టి మండలం బోర్గి, చివరి పోలింగ్ కేంద్రం మనూరు మండలం ఇస్లాంపూర్‌లో ఉంది. అతి తక్కువ ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రం ఇదే కాగా ఇక్కడ కేవలం 134మంది ఓటర్లు మాత్రమే ఉన్నారు. అత్యధికంగా ఓటర్లు ఉన్న పోలింగ్ కేంద్రం పెద్దశంకరంపేట మండలంలోని వీరోజిపల్లిలోని 124వ పోలింగ్ కేంద్రం. ఇందులో 1,236మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికల్లో 18మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారని వివరించారు.

మీడియా సెంటర్ పరిశీలన

మెదక్ కలెక్టరేట్: మెదక్ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్‌ను జిల్లా సాధారణ పరిశీలకుడు పృథ్వీరాజ్, వ్యయ పరిశీలకుడు సంజయ్ కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల వద్ద గల సీసీ కెమెరాల రికార్డింగ్ పనితీరును తనిఖీచేశారు. అలాగే సీ విజిల్‌లో వచ్చిన ఫిర్యాదులు, వాటి పరిష్కారాలు ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ టీమ్ పనితీరు, మీడియాలో వచ్చే వార్తలు, పెయిడ్ న్యూస్, పత్రికా ప్రకటనలు, ఎలక్ట్రానిక్ మీడియా రికార్డింగ్ పనితీరును తెలుసుకున్నారు. వారి వెంట జిల్లా ఎన్నికల అధికారి రాజర్షిషా, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

కాంగ్రెస్, బీజేపీలను తరిమికొట్టండి

- బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం
- సంక్షేమ పథకాలను చూసి ఓటెయ్యండి
- ఆరు గ్యారంటీలను నమ్మి మోసపోవద్దు
- బీఆర్‌ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు


రంజోల్‌లో నిర్వహించిన ప్రచారంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు

జహీరాబాద్: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలను తరిమికొట్టాలని బీఆర్‌ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు ఓటర్లకు పిలుపునిచ్చారు. మండల పరిధిలోని రంజోల్, తదితర గ్రామాల్లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వాలు అమలుచేయని సంక్షేమ పథకాలకు సీఎం కేసీఆర్ మాత్రమే అమలు చేశారన్నారు. పింఛన్లు, రైతుబంధు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబీమా తదితర పథకాలు ప్రవేశపెట్టి అన్నివర్గాల ప్రజలకు అండగా నిలిచారన్నారు. బీఆర్‌ఎస్‌కు మరోమారు పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మద్దె రాంరెడ్డి, బాసిత్, నారాయణరెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మరోసారి అవకాశం ఇవ్వండి

బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి మరోమారు అవకాశం కల్పించాలని ఆ పార్టీ అభ్యర్థి మాణిక్‌రావు, ఐడీసీ చైర్మన్ తన్వీర్, డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవిప్రసాద్ కోరారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధిని చూసి బీఆర్‌ఎస్‌కు ఓటు వేసి గెలిపించాలన్నారు. కాంగ్రెస్ మాయమాటలను నమ్మి మోసపోవద్దని కోరారు. సమావేశంలో నాయకులు గుండప్ప, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

న్యాల్‌కల్(జహీరాబాద్): మండల పరిధిలోని రుక్మాపూర్ తండాకు చెందిన అబర్‌సింగ్, ప్రేమ్‌సింగ్, జవహర్, వినోద్, విజయ్ తదితరులు బీఆర్‌ఎస్ మాజీ మండల అధ్యక్షుడు నర్సింహరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో నాయకులు సయ్యద్ శకీల్, నీలంరెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మాణిక్‌రావు సతీమణి మధులత

జహీరాబాద్ టౌన్: బీఆర్‌ఎస్ అభ్యర్థి మాణిక్‌రావు సతీమణి మధులత పస్తాపూర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పురుషోత్తంరెడ్డి, అశోక్‌రెడ్డి, కార్యకర్తలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.


బీఆర్‌ఎస్‌లో చేరిన రుక్మాపూర్ తండాకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు


పస్తాపూర్‌లో ప్రచారం నిర్వహిస్తున్న మాణిక్‌రావు సతీమణి మధులత